క్లుప్తంగా

కంప్యూటర్ విద్యపై నైపుణ్యం సాధించాలి



కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: విద్యార్థులు కంప్యూటర్ విద్యపై నైపుణ్యం సాధించాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.కేశవరావున్నారు. పాఠశాలలో డిజిటల్ ల్యాబ్‌ను గురువారం ప్రారంభించారు అధునాతనమైన ఈ ల్యాబ్‌లో ప్రాజెక్టర్, కలర్ ప్రింటర్‌తోపాటు 8 కంప్యూటర్లు ఉన్నాయన్నారు. ఈ రోజుల్లో అన్ని రంగాల్లో కంప్యూటర్ విద్యకు ప్రాధాన్యత ఉందన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌ను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు అరుణ, క్రాంతికుమార్, కంప్యూటర్ ట్రైనర్ రమేష్, వేణమ్మ, కృష్ణ, బాలామణి ప్రసాద్ ఉన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండల కేంద్రంలో శుక్రవారం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటించనున్నారు. ఈ మేరకు స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ప్రారంభం, కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోపూజ చేస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో పౌర్ణమి పురస్కరించుకుని అర్చకులు సిద్దయ్య స్వామి ఆధ్వర్యంలో గురువారం గోపూజ నిర్వహించారు. అనంతరం సత్సంగం కార్యక్రమం ఏర్పాటు చేశారు. హిందూ ధర్మంలో గోపూజ ఆవశ్యకతను నర్సింహ స్వామి వివరించారు. రామాయణం, మహాభారతంలోని పలు ముఖ్య ఘట్టాలను భక్తులకు తెలియజేశారు. దయానంద స్వామి, తమిరి కరుణశ్రీ, తెట్ట సోమేశ్వరరావు, బోయిన వెంకటరమణ తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. మెండ రంగారావు, మొయ్యి శిమ్మయ్య, లక్ష్మీనారాయణ, మట్ట లచ్చుము తదితరుల ఆర్థిక సహాయంతో అన్న సంతర్పణ నిర్వహించారు.

142 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తు వైద్యులు

బూర్జ: మండలంలోని లక్కుపురంలో మన్యం జిల్లా పాలకొండలోని శ్రీవిజయ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ కర్నేన దీప గురువారం ప్రారంభించారు. 142 మంది రోగులకు వైద్యులు సాయి శంకర్, పర్వీన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. దీర్ఘకాలిక, బీపీ, సుగర్ రోగులకు తనిఖీలు చేపట్టారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, హాస్పటల్ సిబ్బంది, స్థానిక నాయకుడు వి.కృష్ణరావు పాల్గొన్నారు.

భూ రీసర్వే సక్రమంగా చేపట్టాలి



రీ సర్వే రికార్డులు తనిఖీ చేస్తున్న జేసీ నవీన్‌కుమార్

సరుబుజ్జిలి: భూ రీసర్వేలో ఎటువంటి తప్పులు దొర్లకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని రెవెన్యూ, సర్వే సిబ్బందికి జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్‌కుమార్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం భూ సర్వే రికార్డులు తనిఖీ చేశారు. సరుబుజ్జిలి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆడుదాం ఆంధ్రా పోటీలు అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్, ఈఓపీఆర్డీ ఆనందరావు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరులకు న్యాయం చేయండి

పాతపట్నం: దస్తావేజు లేఖరులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రెండో రోజు స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణంలో పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విధానంలోనే దస్తావేజులు తయారు చేసుకునేలా అనుమతి ఇవ్వాలని కోరారు.

పొందూరు: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు గురువారం రెండో రోజు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్డ్ ప్రైమ్ 2.0 విధానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. దస్తావేజు లేఖర్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అపూర్వ స్పందన



వృద్ధుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని బెలమాం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును వివరిస్తూ, ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా జరిగిన లబ్ధిని గురించి తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేన్నరేళ్ల పాలనలో జగనన్న గ్రామాలను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఇంటి వద్దకే సచివాలయ పాలన తీసుకువచ్చి పథకాలను అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే అధికారులతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ఈ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజా సంక్షేమమే అజెండాగా పరిపాలన సాగిస్తున్న ప్రభుత్వానికి రానున్న రోజుల్లోనూ ఆదరించాలని కోరారు. దొంగ మ్యానిఫెస్టోల ద్వారా మరలా ప్రజలను మభ్యపెట్టడానికి టీడీపీ నాయకులు వస్తారని, వారి మాయమాటలను నమ్మవద్దన్నారు. గడిచిన టీడీపీ పాలనలో ప్రజలకు, గ్రామాలకు ఏం చేశారో నిలదీయాలన్నారు. ఇంటి వద్దకే పరిపాలన తీసుకువచ్చినందున ప్రస్తుతం గ్రామాల్లో తిరుగుతూ ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటున్నామన్నారు. అవినీతి రహిత పాలన అందించడం వల్లే గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి మరింత ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కణుగుల కిశోర్, పార్టీ నాయకులు బెండి గాంధీ, సీపాన మల్లేశ్వరరావు, పూజారి కాంతారావు, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఏఓ మెట్ట మోహనరావు, ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్, ఏపీఎం పైడి కూర్మారావు, ఏపీఓ లక్ష్మీనరసమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కె.చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి దమయంతి, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వంశధార కార్యాలయ భవనాల ప్రారంభం



భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: బొడ్డేపల్లి రాజగోపాలరావు వంశధార ప్రాజెక్టు కట్టడాల విభాగం డివిజనల్ కార్యాలయం అనుబంధ కార్యాలయాల నూతన భవనాలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. దీంతో ప్రభుత్వం జలవనరుల శాఖ నిధులు రూ.3 కోట్లతో నూతన కార్యనిర్వహణ, ఉపకార్యనిర్వహణ భవనాలను నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కట్టడాల విభాగం ఈఈలు ఎం.వి.రమణ, త్రినాథ్, రామచందరరావు, సీతారాం నాయుడు, శ్రీకాంత్, డీఈలు, ఏఈలు, తహసీల్దార్ బి.మురళీ మోహన్‌రావు, పంచాయతీ సర్పంచ్ సుందరమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, నాయకులు, వంశధార సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ స్థలాల ఆక్రమణ!



పార్వతీశునిపేట జంక్షన్‌లో ఆక్రమణలకు గురైన రహదారి

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస పట్టణానికి కిలో మీటరు దూరంలో ఉన్న పార్వతీశునిపేట జంక్షన్‌లో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరగడంతో నిత్యం ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి. అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డు నుంచి పాలకొండ సీఎస్‌పీ రోడ్డుకు అనుసంధానంగా ఉండే పార్వతీశునిపేట జంక్షన్ వద్ద నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తున్నందున రద్దీగా ఉంటుంది. బత్తిలి నుంచి వచ్చే వాహనాలు శ్రీకాకుళం వైపు వెళ్లేందుకు ఆమదాలవలస పట్టణాన్ని దరిచేరకుండా అతి తక్కువ సమయంలో చేరుకునే ఏకైక మార్గం ఇదే. ఇలాంటి రహదారిపై నిత్యం వాహనదారులు, ప్రయాణికులు కష్టాలు పడుతున్నారు. పార్వతీశునిపేట జంక్షన్ మలుపు వద్ద ఎక్కువ స్థలం వాహన రాకపోకలకు కేటాయించడంతో వాటిని కొందరు అక్రమణలు చేసి రహదారి మలుపును మూసివేస్తున్నారు. రోడ్డుపై పాకలు వేసి, వాటి ముందు వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. పట్టణానికి దగ్గరగా ఉన్న ఈ జంక్షన్‌లో భూముల ధరలు ఎక్కువగా ఉన్నందున ఆర్అండ్‌బీ రోడ్డుపై అక్రమణలు పెరుగుతున్నాయి. ఈ ఆక్రమణలను తొలగించకుంటే భవిష్యత్‌లో పలు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ఈ ఆక్రమణలపై ఆర్అండ్‌బీ, ఇతర శాఖల అధికారులు పరిశీలన చేసి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనాదారులు కోరుతున్నారు.

ఇసుక మాఫియాకు బ్రాండ్ అంబాసిడర్ 'కూన'



మాట్లాడుతున్న సువ్వారి గాంధీ

ఆమదాలవలస: గత టీడీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో ఇసుక మాఫియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా పేరుపొందిన వ్యక్తి టీడీపీ మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇసుక బకాసురుడు అయిన కూన రవి కుమార్ ఇసుక కోసం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇసుక పాలసీ కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 2014–2019 వరకు గత టీడీపీ ప్రభుత్వంలో కూన చేసిన అవినీతి, అక్రమాలు, ఇసుక దందా కోసం ఆమదాలవలస నియోజకవర్గం ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ఇసుక కోసం కూన మాటలు ఆడుతుంటే ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రవికుమార్ చేసిన అక్రమాలు తేటతెల్లం కావడంతోనే 2019లో ఆయనను ప్రజలే ఇంటికి పంపించారని గుర్తుచేశారు. ఆ విషయం మర్చిపోయి ఎన్నికలు దగ్గరికి వస్తున్నాయని ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న ఆయనకు మళ్లీ నియోజకవర్గ ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీద బురదచల్లాలని చూసిన ఆయనను నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్ కూడా దక్కదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సువ్వారి అనిల్‌కుమార్, పేడాడ వైకుంఠరావు, పెయ్యల సూర్యారావు, బొడ్డేపల్లి మన్మథరావు, ఎన్ని శ్రీను, పైడి విజయ్, బగాది నేతాజీ, రాజశేఖర్, రాపాక ఎంపీటీసీ పోతురాజు సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం



ధ్వంసం చేసిన శిలాఫలకం

ఎల్.ఎన్.పేట (కొత్తూరు): కొత్తూరు మండలంలోని గూనభద్ర గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తిచేశారు. గురువారం ఉదయం పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేతులు మీదుగా భవనం ప్రారంభించేందుకు స్థానిక నాయకులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఏర్పాట్లు చేశారు. శిలాఫలకం ధ్వంసంపై పంచాయతీ కార్యదర్శి రామనారాయణ కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎం.గోవింద్ తెలిపారు.

నూతన పద్ధతుల్లో విద్యా బోధన

పొందూరు: బోధనలో నూతన పద్ధతులను అవలంబిస్తూ, టెక్నాలజీని పెంపొందించుకోవాలని ఎంఈఓ–2 పట్నాన రాజారావు తెలిపారు. మండలంలోని పిల్లలవలస జెడ్పీహైస్కూల్లో పొందూరు, జి.సిగడాం మండలాల సోషల్ అసిస్టెంట్‌ల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను గురువారం పరిశీలించారు. రెండు మండలాల నుంచి 35 మంది స్కూల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం



సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న బొమ్మాళి అసిరమ్మ

సారవకోట: ఇటీవల జరిగిన బద్రి సర్పంచ్ ఉప ఎన్నికలలో ఎన్నికైన బొమ్మాళి అసిరమ్మ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. పంచాయతీ కార్యదర్శి మురళి సర్పంచ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. సర్పంచ్ విధులు, బాధ్యతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మెండ సూర్యనారాయణ, మెండ సుందరరావు, వైస్ సర్పంచ్ బైరి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



డిగ్రీ కళాశాల లోగోను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి

పొందూరు: విద్యార్థులు సత్ప్రవర్తనతో విద్యనభ్యసించినప్పుడే సమాజానికి, దేశానికి మేలు చేసేవారుగా ఎదుగుతారని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ బి.జ్యోత్స్న అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చట్టాలపై, న్యాయశాస్త్రంపై గ్రామాల్లో ప్రజలకు యువతే అవగాహన కల్పించాలన్నారు. మహిళలకు సంబంధించిన చట్టాలైన పోక్సో, దిశా, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు చట్టాలపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. డిగ్రీ కళాశాల లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పొందూరు బార్ అసోసియేషన్ చైర్‌పర్సన్ కె.మంజుల, ఎస్సై లక్ష్మణరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రాము, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌మనోహర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదనరావు

నరసన్నపేట: మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ గడపగడపకు నిధులతో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలు సెప్టెంబర్ 15 కల్లా పూర్తిచేయాలని ఎంపీడీఓ మధుసూదనరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు నిధులు మంజూరైన చోట పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయించాలని, అలసత్వం చూపితే ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మడపాం, రావులవలస, నడగాంతోపాటు పలుచోట్ల సచివాలయాల భవనాల పనులు చివరి దశలో ఉన్నాయని, వాటిని పూర్తి చేయించాలన్నారు. అలాగే ఇతర నిర్మాణాలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. మారిన నిబంధనల మేరకు ప్రతీ పంచాయతీకి ఒక క్యూర్ కోడ్ స్టేట్ బ్యాంకు ఇచ్చిందని, వాటిని ఆయన కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఇకనుంచి పంచాయతీల్లో డిజిటల్ పేమెంట్లు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓగా పదోన్నతిపై బదిలీ వెళ్లిన సూపరింటెండెంట్ తిరుపతిరావును సత్కరించారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మోహనరావు, ఉద యభాస్కర్, నరసన్నపేట ఈఓ సింహాద్రి నాయుడు పాల్గొన్నారు.

టీడీపీది తప్పుడు ప్రచారం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ పట్ల వ్యతిరేకతతో నరసన్నపేటలో వైశ్యులు ఉన్నారని టీడీపీ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని వైఎస్సార్ సీపీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, పాట్నూరు సాయి ప్రసాద్, వైశ్యరాజు కేశవరాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద గురువారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని సూచించారు. గురువారం ఇద్దరు వ్యక్తులకు బలవంతంగా టీడీపీ కండువాలు వేసి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీలోకి వచ్చేస్తున్నారని సోషల్ మీడియాలో ప్రచారం చేశారన్నారు. టీడీపీలో చేరినవారు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కాదన్నారు. కాగా గంట తరువాతే వారే మాట్లాడుతూ టీడీపీ నాయకులే తమను బలవంతంగా కండువాలు వేశారన్నారు. ఈ విషయం టీడీపీ నాయకులు గమనించాలన్నారు. ఆగస్టు నెలలో చాలా రోజులు నరసన్నపేట పట్టణంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించామని, దీంట్లో వైశ్యులందరూ పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో సహించలేకే టీడీపీ నాయకులు ఈ విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. మరో 30 ఏళ్లు జగనన్న పాలనే ఉంటుందని, వచ్చే ఎన్నికల తరువాత టీడీపీ ఖాళీ అవుతుందని జోష్యం చెప్పారు. పార్టీ నాయకులు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఎంపీటీసీ డేవిడ్, వార్డు సభ్యులు బీఎల్ శర్మ, పార్టీ కార్యదర్శి కోటిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస: జగనన్న ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్ కూడలి వద్ద ఆహా క్యాంటీన్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళల పేరునే మంజూరుచేస్తూ మహిళా పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన మాటను నిలబెట్టుకుంటున్నారన్నారు. మహిళల అభ్యున్నతికి మరింత మేలు చేసే కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టనుందన్నారు. ఆహా క్యాంటీన్ ద్వారా రుచికరమైన, శుచికరమైన ఆహారాన్ని తక్కువ ధరకే విక్రయిస్తారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు డి.శ్యామలరావు, ఎస్.మల్లికార్జునరావు, కె.శ్యాం ప్రసాదరావు, పార్టీ నాయకులు పి.చిన్నారావు, బి.కోటేశ్వరరావు, బి.వి.రమణమూర్తి, బి.విశ్వేశ్వరరావు, ఎస్.చిరంజీవి, మునిసిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఆరోపణల్లో నిజం లేదు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాంలో కొందరు టీడీపీ నాయకులు వారి ఉనికి కోసమే తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారని సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి అన్నారు. కాలువలు అక్రమణలు జరుగుతున్నాయని టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. గతంలో ఇలానే ఎర్రన్నాయుడు అనే వ్యక్తి తన జిరాయితీలో చేపట్టిన నిర్మాణంపై టీడీపీ నాయకులు ఫిర్యాదులు చేస్తే.. అధికారులు కొలతలు వేసి జిరాయితీగా నిర్ధారించారన్నారు. కాలువకు ఆనుకుని ఉన్న జిరాయితీ స్థలాల్లో గతంలో షాపులు ఉండేవని, రోడ్డు నిర్మాణంలో భాగంగా అవి తొలగించారని, మిగిలిన స్థలంలో ఇప్పుడు షాపులు కడుతున్నారే తప్ప.. కాలువలో ఆక్రమణలు జరగలేదన్నారు. అలాగే రోడ్డు విస్తరణలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉర్లాం పార్వతీశ్వరరావు తన సొంత స్థలాన్నే ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ఉర్లాం కూడలి వద్ద బడ్డవానిపేటకు వెళ్లే టర్నింగ్‌లో రోడ్డు వెడల్పు అయిందన్నారు.

• అనురాగానికి ప్రతీక రక్షా బంధన్



ఎల్.ఎన్.పేట: ఎమ్మెల్సీ విక్రాంత్‌కు రాఖీ కడుతున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని గ్రామాల్లో సందడి నెలకొంది. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఎల్.ఎన్.పేట: తురకపేట ఎస్‌వీ స్కూల్ వద్ద రాఖీలు కడుతున్న విద్యార్థులు



సారవకోట: చీడిపూడిలోని నీలమణి అమ్మవారికి రాఖీ కట్టేందుకు వెళ్తున్న భక్తులు



సరుబుజ్జిలి: ఉపాధ్యాయులకు రాఖీలు కడుతున్న హిందీ టీచర్

మర్రిపాడులో సామాజిక తనిఖీ గ్రామసభ

మెళియాపుట్టి: సామాజిక తనిఖీల ద్వారా ప్రజలకు పలు అభివృద్ధి పనులపై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని డీఆర్పీ రమణబాబు అన్నారు. మండలంలోని మర్రిపాడు–సి గ్రామ పంచాయతీలో ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ అధ్యక్షతన సామాజిక తనిఖీ గ్రామసభ గురువారం నిర్వహించారు. 2022–23లో ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఐటీడీఏ తదితర శాఖలలో జరిగిన పనులకు సంబంధించి ప్రస్తుత పరిస్థితి, ఖర్చుకు తగ్గట్టుగా నాణ్యత ఉందా, లేదా? అనేదానిపై తనిఖీలు నిర్వహించామన్నారు. సామాజిక తనిఖీలు నిర్వహించడం ద్వారా ప్రజలకు సైతం లోటుపాట్లు తెలుస్తాయన్నారు. అందువల్ల తనిఖీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తనిఖీ నిర్వహించిన అనంతరం గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. తుది నివేదికను మండల స్థాయిలో ఈ నెల 12వ తేదీన జరగనున్న ప్రజా వేదికలో వెల్లడించనున్నట్లు తెలిపారు. కార్యదర్శి వనజాక్షి, టీఏ నాయుడు, ఎఫ్ఏలు సింహాచలం, శేషగిరి తదితరులు ఉన్నారు.

శ్రీముఖలింగానికి భక్తుల తాకిడి

జలుమూరు: శ్రీముఖలింగంలో మధుకేశ్వరుని దర్శించుకునేందుకు గురువారం భక్తులు బారులు తీరారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, వారిహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని స్వామివారికి పూజలు చేసేందుకు జిల్లా నలుమూలలతోపాటు విజయనగరం, విశాఖ జిల్లాలు, ఒడిశా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.